

ఇదో అభిమానం

చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ బొమ్మనే ఏకంగా తన చేతిపై పచ్చబొట్టు పొడిపించుకున్నాడు ఒక అభిమాని. జిల్లా వడ్డెర సంఘం నాయకుడు హరిబాబు శుక్రవారం ఎమ్మెల్యేకి తన చేతిని చూపించి అభిమానాన్ని చాటుకున్నారు.

- గుడిపాల

రివర్షన్

● వీఆర్వో నుంచి వీఆర్ఏగా..

నిబంధనలను ఉల్లంఘించి ప్రభుత్వ భూములను ఆక్రమించినందుకు చౌడేపల్లె మండలం గడ్డంవారిపల్లె వీఆర్వో వై.వెంకటమునిని వీఆర్ఏగా రివర్షన్ ఇస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పుంగనూరు మండల పరిధిలోని ప్రభుత్వ అసైన్డ్‌భూమిని తన అధికారాన్ని దుర్వినియోగం చేసి సొంత కుటుంబ సభ్యుల పేరిట పట్టా మంజూరు చేయించారని ఫిర్యాదు అందింది. దీనిపై మదనపల్లె సబ్‌కలెక్టర్‌ను విచారణ అధికారిగా నియమించి ఫిర్యాదుపై విచారణ జరిపించారు. ఈ విచారణలో వెంకటముని అధికార దుర్వినియోగం చేసినట్లు సబ్‌కలెక్టర్ ఇచ్చిన నివేదికలో రుజువైంది. దాంతో ఆయన్ని వీఆర్వో నుంచి వీఆర్ఏగా రివర్షన్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

- చిత్తూరు కలెక్టరేట్

సీఎం అభినందన

మిస్ యూనివర్స్- ఇండియాకు ఆంధ్రప్రదేశ్ నుంచి అర్హత సాధించిన చందన జయరాంను సీఎం చంద్రబాబు నాయుడును అభినందించారు. ఈమె కుటుంబ సభ్యులతో శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎంను కలిశారు. కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం ఎంకే పురానికి చెందిన చందన జయరాం ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో మిస్ యూనివర్స్- ఇండియాకు రాష్ట్రం నుంచి ఎంపికయ్యారు. ముంబైలో జరుగనున్న మిస్ యూనివర్స్- ఇండియా పోటీల్లో ఈమె పాల్గొననున్నారు. ఈ పోటీలకు అర్హత సాధించడంపై ఆమెను చంద్రబాబు అభినందించారు.

- చిత్తూరు కలెక్టరేట్



దండోరా పోరాటముద్రలు



● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1996నుంచి ఉద్యమాలు

● ఫలితం దక్కిందంటూ మాదిగల హర్షాతిరేకాలు

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెనుక దండోరా పేరుతో ఎమ్మార్పీఎస్ చేపట్టి సాగించిన సుదీర్ఘకాలపు పోరాటం ఉంది. ఈ ఉద్యమ సంఘటనలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అనేక ప్రాంతాలు వేదికలయ్యాయి. ఉద్యమ ఉధృతికి సాక్ష్యంగా నిలిచిన కొన్ని సందర్భాల సమాహారం ఇది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి





చిత్తూరు కలెక్టరేట్ ఎదుట 2015లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న నేతలు

రెండు సార్లు నారావారిపల్లె నుంచి పాదయాత్ర

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 1998లో ఓ సారి, 2010లో మరో సారి సీఎం చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లె నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేశారు. 2010లోనే మందకృష్ణ హైదరాబాద్‌లో మొదలుపెట్టిన ఆమరణ నిరాహార దీక్షకు సంఘీభావంగా ఉమ్మడి జిల్లాలోని 66 మండలాల్లోనూ ఆమరణ నిరాహార దీక్షల్ని ప్రారంభించారు. 3 రోజులకే పోలీసులు దీక్షల్ని భగ్నం చేయగా.. 25 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేశారు.

● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1996 నుంచీ ఎమ్మార్పీఎస్ ఉద్యమ కార్యాచరణ మొదలైంది. తొలి కార్యక్రమమే నాటి సీఎం చంద్రబాబు స్వగ్రామమైన నారావారిపల్లి నుంచీ హైదరాబాదుకు పాదయాత్ర వంటి భారీ కార్యక్రమం కాగా అందులో మంద కృష్ణ మాదిగ స్వయంగా పాల్గొన్నారు.

● 2006లో మదనపల్లె నుంచీ ఛలో హైదరాబాదు కార్యక్రమానికి మదనపల్లె దిగువ కమ్మపల్లెకు చెందిన మనిగే రామయ్య రైల్లో వెళుతూ మహబూబ్‌నగర్ వద్ద జారిపడి చనిపోయారు.

● 2007లో ఎమ్మార్పీఎస్ ఆందోళనకారులు మదనపల్లె సమీపంలోని అంగళ్లు వద్ద నాలుగు బస్సులు ధ్వంసం చేసి రెండింటిని తగులబెట్టారు. 32మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొని జైలుపాలయ్యారు. అదే ఏడాది పీలేరు రైల్వే స్టేషన్‌లో సిగ్నల్ రూమ్‌ను తగులబెట్టిన ఘటనలో ఎనిమిది మంది జైలుకు వెళ్ళారు. ఆ ఏడాదిలోనే కలకడ ఎంపీడీవో కార్యాలయాన్ని తగులబెట్టిన ఘటనలో ఆరుగురు క్రిమినల్ కేసులు ఎదుర్కొన్నారు.

● 2008లో అంగళ్లు బస్టాండులో ఆర్టీసీ బస్సును తగలబెట్టేశారు.చిత్తూరులోని టీడీపీ కార్యాలయాన్ని ముట్టడించారు.

● 2009లో కుప్పంలో రైలును అడ్డుకున్న ఘటనలో పోలీసు కేసులు ఎదుర్కొన్నారు. మదనపల్లెలో సెంట్రల్ సెరికల్చర్ కార్యాలయ ఆవరణలో జీపును కాల్చివేసిన ఘనటలో ఆరుగురు జైలుకు వెళ్ళారు. తిరుపతిలో జస్టిస్ ఉషా మెహ్రా పర్యటన సందర్భంగా వర్గీకరణ అనుకూల, వ్యతిరేక వర్గాల నడుమ ఘర్షణ జరిగింది.

● 2010లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ కాన్వాయ్‌ను తిరుపతి ఎన్టీయార్ కూడలి వద్ద అడ్డుకున్న ఘటనలో పోలీసులు జరిపిన లాఠీఛార్జీలో 20 మంది తీవ్ర గాయాలకు గురి కాగా 18 మంది జైలుపాలయ్యారు.



●2011లో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా వున్నపుడు ఆయన నియోజకవర్గ కేంద్రమైన పీలేరు నుంచీ హైదరాబాదుకు మాదిగల తిరుగుబాటు రథయాత్ర జరిగింది. ● 2014లో రాయలసీమ జిల్లాల కన్వీనర్ నరేంద్రబాబు మాదిగ ఆధ్వర్యంలో ములకలచెరువు నుంచి సత్యవేడు వరకు పాదయాత్ర చేశారు. అప్పటి ఎమ్మార్పీఎస్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు దేవరాజులు మాదిగ ఆధ్వర్యంలో కుప్పం నుంచి తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ వరకు పాదయాత్ర చేశారు. ● గతేడాది ఏప్రిల్‌లో తిరుపతిలో జాతీయ మహాసభలు సైతం నిర్వహించారు.

● 1994 నుంచి ఉమ్మడి జిల్లాలో మాదిగ నాయకులపై భారీగా కేసులు నమోదయ్యాయి. పలుమార్లు నేతలను గృహ నిర్బంధం చేశారు.

వర్గీకరణ ఉద్యమాన్ని ఉరకలెత్తించిన నేతలు

ఎమ్మార్పీఎస్ ఎస్సీ వర్గీకరణ ఉద్యమం తొలినాళ్ళలో జిల్లావ్యాప్తంగా పలుచోట్ల చురుగ్గా సాగింది. ప్రారంభంలో తొలినాళ్ళలో చిత్తూరు బ్యాంకు ఉద్యోగి గిరిధర్ ఉద్యమానికి నాయకత్వం వహించారు. తరచూ కార్యక్రమాల్లో పాల్గొంటూ విధులకు హాజరు కాలేక చివరికి ఉద్యోగం కూడా పోగొట్టుకున్నారు. తర్వాతి దశలో ఉద్యమానికి మదనపల్లె బలమైన కేంద్రంగా మారింది. ఆ ప్రాంతానికి చెందిన నేత పీటీఎం శివప్రసాద్ ఉద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించారు. జిల్లాలో జరిగిన మిలిటెన్సీ తరహా ఘటనలన్నింటికీ ఆయనే నాయకత్వం వహించారు. ఆ క్రమంలో పలు క్రిమినల్ కేసులను ఎదుర్కొని జైలుపాలయ్యారు.ఈ రెండవ దశలో మదనపల్లెలో టీచర్ మోపూరి కృష్ణప్ప, పాలిటెక్నిక్ విద్యార్థి చలవాది శ్రీనివాసులు, మలారి గిరిబాబు, పీటీఎంలో కేవీ రమణ, పుంగనూరులో మిద్దింటి వెంకటస్వామి, చిత్తూరులో ప్రభుత్వ ఉద్యోగి చెంగయ్య, పాకాలకు చెందిన బాబు, సుగుణమ్మ దంపతులు, కేవీపల్లెలో ముల్లంగి చంద్రయ్య, తంబళ్ళపల్లెలో పాతకోట సుబ్బన్న, తిరుపతిలో గోపీ తదితరులు నాయకత్వం చేపట్టి చురుగ్గా పనిచేశారు. మూడవ దశలో మదనపల్లెలో నరేంద్రబాబు, మంచూరు మారెప్ప, పీలేరులో గండికోట వెంకటేష్, తిరుపతిలో ఒడ్డెపోగు రవి, వైకే విశ్వనాథ్, టీటీడీ ఉద్యోగి వెంకటరత్నం, ఎర్రావారిపాలెంలో నడిమికండ్రిగ సుధాకర్, కుప్పంలో దేవరాజు తదితరులు నాయకత్వం వహించి ఉద్యమాన్ని ముందుకు నడిపించారు.



2014లో కుప్పం నుంచి తిరుపతి వరకు ఎమ్మార్పీఎస్ నాయకుల పాదయాత్ర

30 ఏళ్ల కష్టానికి ఫలితం



30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అనేక ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నాం.సుప్రీంకోర్టు తీర్పుతో మా కష్టానికి ఫలితం దక్కింది. మందకృష్ణ మాదిగ మాదిగల దేవుడు.

- బాబు, ఎమ్మార్పీఎస్ నేత, చిత్తూరు

మా బిడ్డల భవిష్యత్తు కోసమే



మా బిడ్డల భవిష్యత్తు బాగు పడుతుందనీ, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మాదిగ ఉప కులాలు బాగు పడుతాయని ఎన్నో రకాల ఉద్యమాలు చేశాం. కేసులు పెట్టించుకుని, అరెస్టు అయ్యాం. ఫలితం దక్కింది.

- శివయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, నగరి

మాదిగలకు నిజమైన స్వాతంత్ర్యం



30 ఏళ్ల కల సాకారమైంది. దేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడో వచ్చినా, మాదిగలకు మాత్రం సుప్రీంకోర్టు తీర్పుతో నిజమైన స్వాతంత్ర్యం ఇప్పుడు వచ్చింది.

- దేవరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షుడు

బిల్లుల స్వీకరణకు బ్రేక్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2: ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ అప్ లోడింగ్ జరుగుతున్న దృష్ట్యా గురువారం నుంచి సోమవారం వరకు సీఎఫ్ఎంఎస్ సర్వీసులు నిలిపివేసినట్లు ఆర్థికశాఖ తెలిపింది. ఈ కారణంగా ఖజానా శాఖకు చెందిన సబ్ ట్రెజరీ కార్యాలయాలు గురువారం నుంచి జీతాలు, కంటిన్జెంట్, సప్లిమెంటరీ, పాత ఇంక్రిమెంట్ తదితర బిల్లుల స్వీకరణ నిలిపివేసింది.

పదోన్నతి జాబితాపై అభ్యంతరాలు తెల్పండి

చిత్తూరు (సెంట్రల్), జూలై 2: చిత్తూరు, తిరుపతి నగరపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీల పదోన్నతి జాబితా ఎంఈవో మెయిల్స్ పంపామని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని డీఈవో దేవరాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్ఏ (తెలుగు, హిందీ) పదోన్నతుల సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలు ఉంటే 5వ తేదీలోపు డీఈవో కార్యాలయంలో తెలియజేయాలని తెలిపారు.

నేటి నుంచి తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2: పేద, మధ్య తరగతి వర్గాలకోసం మరోసారి శనివారం నుంచి బియ్యం, కందిపప్పు ధరలను తగ్గించి ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించనున్నట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. చిత్తూరులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం నుంచి రైతుబజార్, రిలయన్స్ మోర్, జియోమార్ట్ వంటి సూపర్‌మార్కెట్, మాల్స్‌తో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా కిలో కందిపప్పు రూ.150, బియ్యం రూ.47, స్టీమ్డ్ బియ్యం రూ.48 చొప్పున వినియోగదారులందరికీ తక్కువ ధరలో అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. 1-15 తేదీల మధ్య ఎండీయూ ఆపరేటర్ల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నామని, బయోమెట్రిక్ పనిచేయని పక్షంలో ఐరిష్ లేదా వీఆర్వో ఆమోదంతో రేషన్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎండీయూ ఆపరేటర్లకు ఇచ్చే నిత్యవసర వస్తువులను తూకం వేసి అందజేయాలన్నారు. ఎండీయూ ఆపరేటర్ల ద్వారా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్డుదారులు ఆరోపించారు. సమావేశంలో డీఎస్వో శంకరన్, సివిల్ సప్లై కార్పొరేషన్ డీఎం మోహన్‌బాబు, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, డీవైఈవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

ఏదో అనుకుంటే.. ఇంకేదో అయ్యిందే!

● కోరిన స్థానం లభించక సర్దుబాట్లలో తహసీల్దార్లు

● మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ

● ఏడుగురు డీటీలకు తహసీల్దార్లుగా పూర్తి అదనపు బాధ్యతలు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2: జిల్లాలో 30 మంది తహసీల్దార్లను సర్దుబాటు చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు వెళ్లి తిరిగొచ్చిన తహసీల్దార్లు తమకు అనుకూలమైన మండలాల్లో పోస్టింగ్స్ కోసం.. తెలిసిన అధికార కూటమి నాయకుల ద్వారా ఎమ్మెల్యేల వద్దకు వెళ్ళి సిఫార్సులేఖలు తెచ్చుకుని కలెక్టరేట్‌లో సమర్పించారు. తాను కోరుకున్న, బాగా రాబడి వస్తుందనుకున్న మండలాల్లో పోస్టింగ్స్ వస్తుందని ధీమాగా ఉన్న కొందరు తహసీల్దార్లను సీసీఎల్ఏ జారీచేసిన మార్గదర్శకాలు ఇబ్బందుల్లో నెట్టేసింది. కలెక్టర్ జారీచేసిన జాబితాల్లో తాము కోరుకున్న మండలాలు లేకపోవడంతో ఏదో అనుకుంటే... ఇంకేదో అయ్యిందే అన్నట్లు దిగాలు పడ్డారు. గతంలో పనిచేసిన మండలాల్లో, సొంత డివిజన్‌లో తహసీల్దార్లకు మళ్లీ పోస్టింగ్ ఇవ్వకూడదని సీసీఎల్ఏ పేర్కొంది. తహసీల్దార్ల సర్దుబాటు జాబితా తయారీలో సీసీఎల్ఏ మార్గదర్శకాలు ఉల్లంఘించారంటూ కొందరు తహసీల్దార్లు ఆరాతీస్తున్నారు.

30 మంది తహసీల్దార్లకు పోస్టింగ్స్

జిల్లాలో 30మంది తహసీల్దార్లకు పోస్టింగ్స్ కల్పిస్తూ జారీ అయిన జాబితా వివరాలు ఇలా ఉన్నాయి. టి. సీతారాం- కలెక్టరేట్ ఏవో, కె.బ్యూలా- కలెక్టరేట్ మెజిస్టీరియల్ సెక్షన్, కె.పద్మజ- కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్, పి. మురళి- కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్,జి.ఎం. కుమారస్వామి- కలెక్టరేట్ ల్యాండ్ అక్విజైషన్ సెక్షన్, ఆర్.వాసుదేవన్- కలెక్టరేట్ ల్యాండ్ రీఫార్మ్స్, ఎస్.ఎస్.కృష్ణ కుమార్- చిత్తూరు ఆర్డీవో ఆఫీసు ఏవో, టి.జి.మోహనవళ్ళి- పలమనేరు ఆర్డీవో ఆఫీసు ఏవో, పి.శివరాం- నగరి ఆర్డీవో ఆఫీసు ఏవో, జి.జయప్రకాష్- కుప్పం ఆర్డీవో ఆఫీసు ఏవో, ఎ.కళావతి- చిత్తూరు అర్బన్, కె.బెన్ను రాజ్-సోమల, బి.హనుమంతు- చౌడేపల్లె, జి.చంద్రశేఖర్ రెడ్డి- గుడిపాల, బి. కులశేఖర్- సదుం,డి.రవి కుమార్-నగరి, ఇ.శేషగిరిరావు- నింద్ర, ఎం.భగవతి- కార్వేటినగరం, వి.చంద్రశేఖర్- గంగాధరనెల్లూరు, ఇ.అమర్‌నాథ్-శ్రీరంగరాజపురం, ఎం.అరుణకుమారి- పాలసముద్రం, ఎస్.ఎం. గుర్రప్ప- పూతలపట్టు, కె.బాబు రాజేంద్రప్రసాద్- బంగారుపాళ్యం,ఆర్.ఇన్బనాధన్ -పలమనేరు,బి.పార్వతి-వి.కోట, ఎస్.మాధవరాజు- విజయపురం, వై.చిట్టిబాబు- కుప్పం, కె.అమర్‌నాథ్- శాంతిపురం, కె.బాబు- రామకుప్పం, బి.రామాంజుల నాయక్ - గుడుపల్లె.

ఏడుగురు డీటీలకు..

ఏడుగురు డిప్యూటీ తహసీల్దార్లకు.. తహసీల్దార్లుగా ఫుల్ అడిషినల్ ఛార్జ్ (ఎఫ్ఏసీ) ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. గంగవరం డీటీ ఎం.ఎస్.ప్రసన్నకుమార్ పెద్దపంజాణికి, ఐరాల డీటీ ఎస్.సుధాకర్ తవణంపల్లెకి, గుడిపాల డీటీ బి.కళ్యాణి పెనుమూరుకు, చిత్తూరు అర్బన్ డీటీ ఎస్.కిరణ్ విజయపురానికి, పెనుమూరు డీటీ కె.మహేష్‌కుమార్ ఐరాలకు, చిత్తూరు డీఎస్వో కార్యాలయ డీటీ జి.ఎల్.శివకుమార్ గంగవరానికి, వెదురుకుప్పం ఆర్ఎస్ డీటీ ఆర్.జయంత్ యాదమరికి తహసీల్దార్లుగా (ఎఫ్ఏసీ) నియమితులయ్యారు. కాగా కొందరు డిప్యూటీ తహసీల్దార్లను ఇతర జిల్లాలకు వ్యక్తిగత వినతులపై బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. పెద్దపంజాణి డీటీ ఎ.ఫణికుమార్ అన్నమయ్య జిల్లాకు, అన్నమయ్య జిల్లా డీఎస్వో కార్యాలయ డీటీ ఆర్.జయసింహ చిత్తూరు జిల్లా పులిచెర్ల తహసీల్దార్‌గా, తిరుపతి జిల్లా డీఎస్వో కార్యాలయ డీటీ కె.రమేష్ బాబు చిత్తూరు జిల్లా వెదురుకుప్పం తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా తహసీల్దార్‌గా పనిచేస్తున్న డి.లక్ష్మీనారాయణను తిరుపతి జిల్లాకు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

కౌండిన్య వాగును అమ్మేస్తున్నారు

ఆక్రమించి, ఇసుకపేరుతో విక్రయం

అడ్డుకున్న గ్రామస్తులపై తిరగబడ్డ వైసీసీ సానుభూతిపరులు



కౌండిన్య కాలువలో ఎక్స్‌కవేటరుతో గాడి తవ్వేసిన అక్రమార్కులు

గంగవరం, ఆగస్టు 2: గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక దిగమింగిన అక్రమార్కులు.. కూటమి పాలనలో ఉచిత పాలసీని జీర్ణించుకోలేకపోతున్నారు. ఏదో ఒక రూపంలో ఇప్పుడూ అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు. గంగవరం కూర్నిపల్లె సమీపంలోని కౌండిన్య వాగులో చోటు చేసుకుంటున్న అక్రమాలే దీనికి నిదర్శనం.

గత ఐదేళ్లలో కొంతమంది వైసీపీ చోటా లీడర్లు రింగుగా ఏర్పడి కూర్నిపల్లె, గంగవరం గ్రామ సమీపంలోని కౌండిన్య వాగులోని ఇసుకనంతా దోచేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో వీరు కౌండిన్య కాలువను అక్రమించేసి.. ఆ పరిధిలోని ఇసుక తవ్వుకోవచ్చంటూ లక్షల రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా నెల రోజుల వ్యవధిలో రూ.2 లక్షల చొప్పున పలువురికి అమ్మేశారు. అదెలాగంటే.. వీళ్లు కౌండిన్య వాగును బిట్లు బిట్లుగా ఆక్రమించారు. హద్దులు చూపి నిర్దీత ప్రాంతాన్ని డబ్బు తీసుకుని కొందరికి అప్పగించేశారు. ఈ విషయం తెలియక కొంతమంది అమాయక ప్రజలు ఇసుక కోసం కౌండిన్య వాగువద్దకు వెళ్తే ఇక్కడ డబ్బు ఇస్తేనే అనుమతిస్తామని, లేకపోతే మీకు దిక్కున్న చోట చెప్పుకోండంటూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో, శుక్రవారం వీఆర్వో, సర్వేయర్ కౌండిన్య వాగు వద్దకు వెళ్లి పరిశీలించారు. నదీకాలువలో ఇష్టానుసారం ఎక్స్‌కవేటర్లతో అడ్డుగా తవ్వేసిన గుంతలున్నాయి. ఇది ప్రభుత్వ స్థలమని చెప్పినా ఆక్రమణదారులు వినలేదు. ఆక్రమణలన్నీ తొలగించిన తర్వాత తమ వద్దకు రావాలని, అప్పుడు తామూ కాలువ అక్రమణ స్థలాన్ని వదిలేస్తామని అక్రమార్కులు ఎదురుతిరిగారు. 'అవును.. మేము రూ.లక్షలు తీసుకొని ఇసుకకు ఈ కాలువలో కొంత స్థలాన్ని ఇచ్చాం. ఇప్పుడేం?' అంటూ అధికారులను నిలదీశారు. దీంతో వారు ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామంటూ వెళ్లిపోయారు. అధికారుల ఎదుటే ఇసుక గడ్డలు అమ్మి లక్షలు తీసుకున్నామని చెప్పడం చూస్తుంటే వారి బరితెగింపు ఎలా ఉందో తెలుస్తోంది. వీరి వెనుక గతంలో ఇసుకను దోచేసిన వైసీపీ చోటా బ్యాచ్ అండ ఉందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకోకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.



కౌండిన్య కాలువ ఆక్రమణపై విచారిస్తున్న అధికారులు

దేశ సమగ్రతను దెబ్బతీసేలా ఉంది

● ఎస్సీ వర్గీకరణ తీర్పుపై కేంద్ర మాజీ మంత్రి చింతా వ్యాఖ్య



ఎస్సీ కార్పొరేషన్‌ను ప్రారంభించాలని ధర్నా చేస్తున్న మాజీ కేంద్రమంత్రి చింతామోహన్

చిత్తూరు, ఆగస్టు 2: రాజ్యాంగం స్ఫూర్తికి విరుద్ధంగా, దేశ సమగ్రతను దెబ్బతీసేలా ఎస్సీ వర్గీకరణ తీర్పు ఉందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ వ్యాఖ్యానించారు. ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలంటూ శుక్రవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రానున్న పదేళ్లలో దేశాన్ని ప్రమాదంలో నెట్టేలా సుప్రీంకోర్టు తీర్పు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ, ఏపీలో ఉన్న కోట్లాది మంది ఎస్సీల ఐక్యతను దెబ్బతీయడానికి రాజకీయ పార్టీలు పని చేశాయని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం పట్ల అవగాహన లేని ప్రధాని మోదీ దేశంలోని రెండు కులాల మధ్య చిచ్చుపెట్టేలా ఎస్సీ వర్గీకరణను తీసుకొచ్చారన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలన్నారు.

38మంది ఎండీయూ ఆపరేటర్లకు జీతాలు కట్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2: ఇంటింటికీ నిత్యవసర వస్తువులు అందించాల్సిన ఎండీయూ వాహన ఆపరేటర్లు విధినిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించారన్న ఆరోపణపై 38మందికి జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లావ్యాప్తంగా 5.45లక్షల రేషన్‌కార్డుదారులకు చిత్తూరు డివిజన్‌లో 167 మంది, పలమనేరు డివిజన్‌లో 169 మంది ఎండీయూ వాహన ఆపరేటర్లు ప్రతినెలా 1-17 తేదీల మధ్య నిత్యవసర వస్తువులు అందజేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.18వేలు.. వారి సహాయకులకు రూ.3 వేలు చొప్పున జీతం చెల్లిస్తున్నారు. జూలై నెలలో కార్డుదారులకు నిత్యావసర వస్తువులు సక్రమంగా అందించని కారణంగా 38మంది ఆపరేటర్ల జీతాలను ఈనెల ప్రారంభంలో నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ఉరేసుకున్న నాగభూషణం

విజయపురం, ఆగస్టు 2: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కళియంబాకం ఆది ఆంధ్రవాడలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు.. కళియంబాకం ఆది ఆంధ్రవాడకు చెందిన నాగభూషణం(48) భార్యతో గొడవపడి 15 ఏళ్లుగా ఒంటరిగా జీవిస్తున్నాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, నాగభూషణం మృతిపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మద్యానికి బానిసై సారా కాచడానికి వెళ్లేవాడని, శుక్రవారం రాత్రి సారా కోసం కమ్మీలు దొంగలించాడని, అతనిపై నలుగురు దాడి చేయడంతో మృతి చెందాడని, కేసు నుంచి తప్పించుకోవడానికి మునగ చెట్టుకు ఉరివేశారనే ఆరోపిస్తున్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించామని, పోస్టుమార్టం రిపోర్టులో నిజాలు వెల్లడవుతాయని ఎస్‌ఐ జయప్ప తెలిపారు.

మామిడిచెట్లకు మందు పిచికారీ చేస్తూ కూలీ మృతి

పూతలపట్టు, ఆగస్టు 2: మామిడిచెట్లకు మందు పిచికారీ చేస్తూ కూలీ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఎగువ పాలకూరు గ్రామానికి చెందిన రామ్మూర్తి (45) అదే గ్రామానికి చెందిన ఓ రైతు మామిడి తోపునకు రెండ్రోజులుగా మందులు పిచికారీ చేస్తున్నాడు. గురువారం పిచికారీ చేస్తుండగా ఊపిరాడక కిందపడిపోయాడు. తోటి కూలీలు చికిత్స నిమిత్తం అతన్ని రంగంపేట క్రాస్‌రోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. సీఐ సుదర్శన్ ప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రూ.55లక్షల కర్ణాటక మద్యం ధ్వంసం



బంగారుపాళ్యం, ఆగస్టు 2: మండల పరిధిలో 2020 నుంచి స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో శుక్రవారం ధ్వంసం చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.55 లక్షల విలువ చేసే 6,901 లీటర్ల మద్యం, 19 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. సీఐ లక్ష్మయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీ మెడికల్ షాపులో ప్రథమ చికిత్స అందించేలోపే మృతి

● వైద్యాధికారికి వినతిపత్రం ఇచ్చిన మృతుడి మనవడు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 2: గంగాధరనెల్లూరులోని ఎస్వీమెడికల్ షాపులో ప్రథమ చికిత్స అందించేలోపే ఆర్ముగంరెడ్డి మృతిచెందారని, దీనిని గుర్తించి వారు తమకు తెలియజేశారని మృతుడి మనవడు గజపాలన్, బంధువులు శుక్రవారం పేర్కొన్నారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. 'అనారోగ్యంతో ఉన్న పీ.బీ.అగ్రహారం గ్రామానికి చెందిన ఆర్ముగంరెడ్డి(60)ని గురువారం ఎస్వీమెడికల్ షాపులో ప్రథమ చికిత్సకోసం తీసుకొచ్చాం. అప్పటికే ఆయన మృతిచెందాడని చెప్పడంతో మృతదేహాన్ని తీసుకెళ్లాం. వైద్యం వల్ల ఆయన మృతిచెందలేదు' అని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ మేరకు డీఎంహెచ్‌వోకు నివేదిక పంపామని పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవి తెలిపారు. మెడికల్ షాపుల నిర్వహణకు, ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స సేవలు అందించడానికి వైద్యపరంగా సర్టిఫికెట్లు లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పవర్‌లైన్ టవర్ల షిఫ్టింగ్ పనులు 15లోపు పూర్తి చేయాలి

తిరుపతి(విద్య), ఆగస్టు 2: తిరుపతి విమానాశ్రయం సమీపంలోని ఏడు ఎలక్ట్రిక్ పవర్‌లైన్ టవర్ల షిఫ్టింగ్ పనులను ఈనెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం జేసీ శుభం బన్సల్‌తో కలిసి తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏపీ ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, రహదారులు భవనాల శాఖ అధికారులతో కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. అధికారులు మాట్లాడుతూ... నాలుగు టవర్లను 8వ తేదీలోపు, మిగిలిన వాటిని 15వ తేదీలోపు షిఫ్ట్ చేస్తామని కలెక్టర్‌కు చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్ట్ సమీపంలో రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారులు, భవనాల శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో హీరో అల్లు శిరీష్



తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): సినీ హీరో అల్లు శిరీష్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఈమేరకు ఆలయ సిబ్బంది అల్లు శిరీష్‌కు ప్రసాదాలు అందజేశారు.

ఏంటిది గోవిందా?

విష్ణునివాసంలోని ఆర్టీసీ బస్సుల పార్కింగ్ స్థలంలో క్యూలైన్ల ఏర్పాటు

రోడ్లపై బారులు తీరుతున్న వాహనాలు

తరచూ ట్రాఫిక్ స్తంభిస్తుండటంతో ఇబ్బంది పడుతున్న డ్రైవర్లు




విష్ణునివాసం ఆవరణంలో పూర్తిగా ఏర్పాటు చేసిన క్యూలైన్లు

తిరుపతిలోని విష్ణునివాసం ఆవరణలోని ఆర్టీసీ బస్సుల పార్కింగ్ స్థలంలో క్యూలైన్ల ఏర్పాటుతో డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యామ్నాయం లేక బస్సులను వెలుపల సర్వీసు రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. ప్రైవేటు వాహనాలతోపాటు బస్సులు కలుస్తున్న కారణంగా రెండు వరుసలుగా పార్కింగ్ విస్తరిస్తోంది. తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీనివల్ల ట్రాఫిక్ పోలీసుల నుంచి అభ్యంతరం ఎదురవుతుండటంతో డ్రైవర్లు ఒత్తిడికి గురవుతున్నారు.

- తిరుపతి (ఆర్టీసీ)


తూర్పు భాగంలో స్థలమున్నా ఒకే క్యూలైను ఏర్పాటు చేశారిలా..

టీటీడీతో కుదుర్చుకున్న అగ్రిమెంట్ ప్రకారం విష్ణునివాసం ఆవరణంలోని ఖాళీ స్థలంలో ఆర్టీసీ బస్సులు పార్కింగ్ చేస్తున్నారు. దాదాపు 10 బస్సులు వరుసక్రమంలో ఉంటాయి. రైల్వేస్టేషన్ ముందు స్థలం ఖాళీ అవగానే ఇక్కడినుంచి బస్సులు ఒకదాని వెంట ఒకటి ముందుకు కదులుతాయి. ఇలా ప్రతి బస్సుకు దాదాపు అరగంట సమయం పడుతుంది. ఆ సమయంలో డ్రైవర్లు కాసింత విశ్రాంతి తీసుకుంటారు. దాంతో తిరుమల ఘాట్‌లో ఎలాంటి ఒత్తిడి లేకుండా బస్సులు నడుపుతూ భక్తులకు సురక్షిత ప్రయాణం అందిస్తుంటారు. ఈ వెసులుబాటుకు మే నెల ఒకటో తేదీన బ్రేక్ పడింది.

మూడు నెలలుగా వాయిదా..

విష్ణునివాసంలో శ్రీవారి సర్వదర్శనానికి టైమ్‌స్లాట్ టోకెన్లు మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. మే నెల నుంచి రద్దీ పుంజుకుంటుందని టీటీడీ భద్రతా విభాగం ముందు జాగ్రత్త చర్యగా ఆర్టీసీకి లేఖ రాసింది. రద్దీని క్రమబద్ధీకరించడానికి పార్కింగ్ స్థలాన్ని క్యూలైన్లు ఏర్పాటుకు అప్పగించాలని కోరింది. ఆ వెంటనే స్వాధీనం చేసుకుంది. నెల తర్వాత అప్పగిస్తామని చెప్పినా అది జరగలేదు. జూన్‌లోనూ కొనసాగింది. జూలైలో వారాంతంలోనూ రద్దీ ఉంటుందని, తాము ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేంతవరకు ఆ క్యూలైన్లు తొలగించమని ఖరాకండిగా చెప్పేసింది. ఇలా పార్కింగ్ స్థలం అప్పగింత విషయం వాయిదా పడుతుండడం ఆర్టీసీ యంత్రాంగాన్ని కలవరపెడుతోంది.

పరిష్కారంపై దృష్టి పెట్టకనే..

ఇక్కడున్న ఖాళీ స్థలాల్లో క్యూలైన్లు ఏర్పాటు చేసుకుంటే.. మిగిలిన స్థలంలో ఆర్టీసీ బస్సులు పార్కింగ్ చేసుకునే అవకాశముంది. దీంతో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అలా చేయకుండా భద్రతా విభాగం తమకు సులువైన మార్గంపైనే ఆధారపడుతోందన్న విమర్శలున్నాయి. అదీగాక అర్ధరాత్రి రెండు గంటలకు టోకెన్ల జారీ ప్రారంభమై ఉదయం ఆరు గంటలకు దాదాపు పూర్తవుతుంది. అప్పటికే వెలుపలున్న భక్తులు విష్ణునివాసం లోపలికి చేరుకుంటారు. ఈ క్రమంలో ఉదయం ఐదు గంటల నుంచే క్యూలైన్లు ఖాళీ అవుతాయి. అంటే ఓ నాలుగు గంటల పాటు రద్దీని క్రమబద్ధీకరించడం బదులుగా స్థలాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవడంతోనే సమస్య తలెత్తుతోంది. టీటీడీకి దీటుగానే ఆర్టీసీ కూడా భక్తులకు సేవలందిస్తున్న విషయం తెలిసిందే. ఇకనైనా టీటీడీ ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఉపాధి పని దినాలు పెంచండి


ఉపాధి హామీ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని దినాలను పెంచాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఉపాధి హామీ అమలు తీరును క్లస్టర్ల వారీగా ఏపీడీ, ఏపీవోలతో కలెక్టర్ సమీక్షించారు. పీఎం ఆవాస్ యోజన పథకం కింద ఇళ్ల నిర్మాణ పనులకు ఉపాధి కూలీలను వినియోగించుకోవచ్చని చెప్పారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌కు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని పేర్కొన్నారు. డ్వామా పీడీ రాజశేఖర్ మాట్లాడుతూ జూలై నెల వరకు ఉపాధి హామీ పథకం కింద 40లక్షల పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 32.26 లక్షలు కల్పిస్తూ 80.67 శాతం లక్ష్యాన్ని సాధించామని వివరించారు.

వంద శాతం ఖరీఫ్ లక్ష్యాన్ని పూర్తిచేయండి


వ్యవసాయ అధికారులతో సమీక్షిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2: ఖరీఫ్‌కు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని జేసీ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణతో కలిసి ఖరీఫ్ సాగుపై ఏడీలు, ఏవోలతో ఆయన సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ ఖరీఫ్‌లో గత ఏడాదికంటే అధిక సాగు చేయడానికి అనుగుణంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకు అధికారులతో చర్చించి సకాలంలో రుణాలు మంజూరు చేయించాలన్నారు. పలమనేరు, బంగారుపాళ్యం మండలాల్లో వేరుశనగ పంటకు అడవిపందులు, ఏనుగుల వల్ల భారీ నష్టాలు జరుగుతున్నాయని, కారణంగా సాగుకు రైతులు ముందుకు రావడంలేదని అధికారులు వివరించారు. మండల అధికారులు పాల్గొన్నారు.

ఆరు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 2: గడచిన 24 గంటల్లో జిల్లాలోని ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. వి.కోటలో 3.2, గుడుపల్లి 2.8, రామకుప్పం 2.4, పలమనేరు 1.8, బైరెడ్డిపల్లి 1.8, గంగవరంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

డెంగ్యూతో బాలిక మృతి


షర్మిల(ఫైల్ ఫొటో)

చిత్తూరు రూరల్, ఆగస్టు 2: నగరంలోని 1వ డివిజన్ కోలాపూరుకు చెందిన కృష్ణమూర్తి, విమల కుమార్తె షర్మిల(11) డెంగ్యూతో శనివారం మృతి చెందింది. సంతపేటలోని బీసీ బాలికల హాస్టల్‌లో ఉంటూ పీఎన్‌సీ మున్సిపల్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఆ బాలిక నాలుగు రోజులు క్రితం జ్వరంతో ఇంటికి వచ్చింది. సమీపంలోని ఆస్పత్రిలో చూపించగా రక్తపరీక్షల్లో డెంగ్యూ అని తేలింది. చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి, తిరుపతికి రూయాకు రెఫర్ చేశారు. రూయాలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఆడుతూపాడుతూ తిరిగిన కూతురు కళ్లముందు విగతజీవిగా కన్పించడం ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు. ఆస్పత్రిలోనే బోరున ఏడ్చేశారు.

ముగిసిన కోదండరాముడి పవిత్రోత్సవాలు



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 2: కోదండరామస్వామి ఆలయంలో రెండ్రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం సీతా, లక్ష్మణ సమేత రాముల వారికి సుప్రభాతం, తోమాల, సహస్రనామార్చన సేవలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి, స్నపన తిరుమంజనం, వైదిక కార్యక్రమాలు పూర్తిచేశారు. సాయంత్రం సీతారామ లక్ష్మణులు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. భాష్యకార్ల గుడివద్ద శాత్తుమొర జరిగింది. తర్వాత యాగశాలలో నిర్వహించిన పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ మూడ్రోజులూ టీటీడీకి చెందిన అన్నమయ్య ప్రాజెక్టు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కళాకారులు ఆలయంలో భక్తి సంగీత కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, కంకణభట్టార్ సీతారామాచార్యులు, సూపరింటెండెంట్ సోమశేఖర్, అర్చకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలపై రైతులు దృష్టి సారించండి


భీమవరంలో కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఉద్యాన అధికారి

చంద్రగిరి, ఆగస్టు 2: రైతులు ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి అన్నారు. చంద్రగిరి మండలం ఐతేపల్లి, భీమవరం గ్రామాల్లోని శ్రీలక్ష్మీకృష్ణ ఉద్యాన ఉత్పత్తిదారుల రైతు సంఘానికి చెందిన కలెక్షన్ సెంటర్లను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం రైతులతో ఆయన మాట్లాడుతూ మామిడి పంట సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. కొమ్మ కత్తిరింపుల అనంతరం లోతుగా దుక్కులు చేసుకుని 10 సంవత్సరాలు పైబడిన చెట్లకు వంద కేజీలు పశువుల ఎరువు, 5 కేజీలు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 2 కేజీలు యూరియా, 1.5 కేజీ పొటాష్ ఎరువులను వేసుకుని మట్టితో మూసి నీరు పెట్టాలని తెలిపారు. 10 ఏళ్ల లోపు వయసుగల మామిడి తోటలలో జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట ఎరువులను ఎకరాకు 10 నుంచి 15 కేజీలు చల్లుకుని పూత వచ్చే ముందు దశలో పొలంలో దున్నుకోవాలని, ఈ విధంగా చేయడం వలన భూమిలో కర్బన శాతం పెరగడమే కాకుండా మొక్కకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో చంద్రగిరి మండల ఉద్యాన అధికారిణి ఎస్. శైలజ, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తిరుమలలో ఈవో, అదనపు ఈవో తనిఖీలు


సౌకర్యాలపై భక్తులతో ఆరా తీస్తున్న ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి శుక్రవారం తిరుమలలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. జేఈవో గౌతమితో కలిసి టీటీడీ భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. మొదట అన్నమయ్య భవనంలో ఏపీటీడీసీ నడుపుతున్న హోటల్‌లో వినియోగిస్తున్న ముడిసరుకులను తనిఖీ చేశారు. తర్వాత పీఏసీ2, మాధవనిలయాన్ని పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న పీఏసీ5ను పరిశీలించి అధికసంఖ్యలో భక్తులు ఉండేలా నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్వీ మ్యూజియంను ఆధునీకరిస్తున్న టీసీఎస్ బృందంతో కలిసి పనుల పురోగతిని పర్యవేక్షించారు. అనంతరం పాంచజన్యం వసతి గృహం వద్దనున్న నూతన వంటశాల, బయట ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, వైకుంఠం కంపార్టుమెంట్లు, అక్షయ కిచెన్‌ను పరిశీలించారు. కంపార్టుమెంట్లలో అన్నప్రసాదాలు ఎలా అందుతున్నాయి, సమయానికి పాలు ఇస్తున్నారా లేదా అని భక్తులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దర్శనానికి ఎంత సమయం పడుతుందనే సమాచారాన్ని కంపార్టుమెంట్ల ముందు రాస్తున్నారా లేదా అని ఆరీతీశారు. కార్యక్రమంలో సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, డీఈ రవిశంకర్‌రెడ్డి, మ్యూజియం ఇన్‌చార్జి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్ఎస్‌డీ భక్తులు కేటాయించిన సమయానికే రావాలి

క్యూలైన్‌లో వేచిఉండే అవసరం లేకుండా ఎస్ఈడీ(రూ.300 ప్రత్యేక దర్శనం) టికెట్లు, ఎస్ఎస్‌డీ(స్లాటెడ్ సర్వదర్శనం) టోకెన్లపై కేటాయించిన సమయానికే దర్శనానికి రావాలని టీటీడీ ఈవో శ్యామలరావు భక్తులకు విజ్ఞప్తి చేశారు. చాలామంది భక్తులు కేటాయించిన సమయానికంటే ముందుకు దర్శనానికి రావడంతో చాలా సమయం వేచిఉండాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. భక్తుల సమాచారం కోసం ఇప్పటికే తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రకటనలు చేస్తున్నామన్నారు. శుక్రవారంనుంచి తిరుపతి రైల్వేస్టేషన్, బస్టాండ్, శ్రీనివాసం, విష్ణునివాసం, అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద కూడా ప్రకటనలు ప్రారంభిస్తామన్నారు. భక్తులు వేచి ఉండకుండా తిరుపతిలోని స్థానిక ఆలయాల సందర్శన లేదా తిరుమలలోని ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించవచ్చని సూచించారు.

హోమం భక్తులనూ సుపథం నుంచి అనుమతించండి

డయల్ యువర్ ఈవోలో భక్తుల విన్నపం

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): 'అలిపిరిలో శ్రీనివాస దివ్యానుగ్రహం హోమం చేసుకునే భక్తులను కూడా సుపథం నుంచి దర్శనానికి అనుమతించండి' అంటూ మునిలక్ష్మి(నెల్లూరు), భాస్కర్(కడప) తిరుమలలో శుక్రవారం ఉదయం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమం ద్వారా ఈవో శ్యామలరావుకు దృష్టికి తీసుకువచ్చారు. 'గతంలో లడ్డూ నాణ్యత చాలా అద్భుతంగా ఉండేది. నోట్లో వేసుకుంటే అమృతంలా కరిగిపోయేది. తర్వాత తగ్గిపోయింది. మీరు వచ్చాకా మార్పులు చేస్తున్నారు. తిరుమలకు గ్రహణం వీడినట్టు అనిపిస్తోంది' అని మచిలీపట్నానికి చెందిన పూర్ణచంద్రశేఖర్ అన్నారు. తిరుమలలోని వసతి గదుల్లో ఎలుకలున్నాయి. మా ప్రసాదాలను తినేయడం వల్ల తీసుకురాలేకపోయాము' అని లక్షణ్(చిలకలూరిపేట) ఫిర్యాదు చేశారు. వీటిపై ఈవో స్పందిస్తూ.. లడ్డూల నాణ్యతను పెంచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎలుకలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక, హోమం భక్తులను సుపథం ఎంట్రీపై పరిశీలన చేస్తామన్నారు. మొత్తం 33 మంది భక్తులు ఫోన్ చేసి ఈవోతో మాట్లాడారు. ప్రధానంగా.. ఆలయంలో తోపులాటలు అధికంగా ఉన్నాయని వెంకటేశ్వర్లు (హైదరాబాద్) తెలుపగా, నివారణకోసం విజిలెన్స్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటారన్నారు. టీటీడీ కల్యాణమండపాలు లీజుకు తీసుకుని రూ.6 లక్షలు ఖర్చుతో ఆధునీకరించామని, తమ పరిస్థితి ఏంటని శ్రీనివాస్(తెలంగాణ) ప్రశ్నించగా, లీజు పాలసీని పరిశీలిస్తున్నామని, అధికారులు మీతో మాట్లాడతారన్నారు. తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో మూలమూర్తుల పాదాల వద్ద హనుమంతి విగ్రహం లేదని శేఖర్ ఫిర్యాదు చేయగా, సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. తొమ్మిదినెలల క్రితం టీటీడీలో ఏఈఈ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారని, ఇంతవరకు రాత పరీక్ష నిర్వహించలేదని దేవానంద్ ఈవో దృష్టికి తీసుకురాగా, త్వరలో నియామకాలు పూర్తి చేస్తామన్నారు. దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు స్వీకరించాలని రాజేష్ కోరగా, సాధ్యం కాదని స్పష్టం చేశారు. తిరుత్తణిలో టీటీడీ స్థలం ఆక్రమణలకు లోనవుతుందని నాగరాజన్(నగిరి) తెలుపగా వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. టీటీడీ పుస్తక విక్రయశాలల్లో టీటీడీ ప్రచురణలు అందుబాటులో ఉంచాలని అలేఖ్య కోరగా, చర్యలు తీసుకుంటామని ఈవో హామీ ఇచ్చారు. అన్నప్రసాదాలు, పాలు నిరంతరాయంగా అందిస్తున్నారని చాలా మంది భక్తులు అభినందించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు లభించింది. బుధవారం ఉదయంనుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన కానుకలను టీటీడీ గురువారం లెక్కించింది. ఈమేరకు రూ.3.66 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ శుక్రవారం ప్రకటించింది. ఇక, గురువారం 61,465 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 21,206 మంది తలనీలాలు సమర్పించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కాలుష్య కోరల నుంచి రక్షించండి


ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న మబ్బువాళ్లపేట గ్రామస్తులు

గంగవరం, ఆగస్టు2: పవర్ ప్లాంట్ నుంచి వెలువడుతున్న కాలుష్యం నుంచి కాపాడాలని మబ్బువాళ్లపేట గ్రామస్తులు ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డిని కోరారు. శుక్రవారం వారు పలమనేరులోని కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూర్నిపల్లె గ్రామ సమీపంలోని పవర్ ప్లాంట్ నుంచి కాలుష్యం విపరీతంగా వెలువడుతోందని, ఫలితంగా నీరుకూడా కలుషితమైందని వాపోయారు. ఇక బూడిద ఇళ్లను కప్పేస్తోందని విచారం వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులకు ఫోన్‌చేశారు. పవర్ ప్లాంట్‌లో కాలుష్యంపై విచారణ జరిపి నివేదికలు అందించాలని సూచించారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామస్తులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కనకనాశమ్మ ఆలయానికి నేడు 2 ఆర్టీసీ సర్వీసులు

కుప్పం, ఆగస్టు 2: కుప్పం మండలం నాయనూరు గ్రామ పంచాయతీ పెద్దవంకలో వెలసిన కనకనాశమ్మ ఆలయంలో శనివారం ఆడిపదునెట్టు మహోత్సవం వైభవంగా జరగనుంది. ఈ ఉత్సవంలో పాల్గొనే ప్రజల సౌకర్యార్థం శనివారం కుప్పం డిపో నుంచి రెండు ఆర్టీసీ బస్సులు పెద్దవంక ఆలయం వరకు నడుపుతామని డీఎం పెంచలయ్య తెలిపారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆలయాల అభివృద్ధికి దేవదాయ శాఖ ప్రణాళికలు

కుప్పం, ఆగస్టు 2: కుప్పం నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయడానికి రాష్ట్ర దేవదాయ శాఖాధికారులు శుక్రవారం వివిధ ఆలయాలను సందర్శించారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ సహాయ స్థపతి పి.పరమేశ్వరప్ప, ప్రసన్న లక్ష్మి, డీఈ శ్రీనివాసులు ఇతర అధికారులు కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయం, మండలంలోని కూనూరు గ్రామంలో వెలసిన పెరివల్లం బాలసుబ్రహ్మణ్య స్వామి ఆలయాలను సందర్శించారు. కుప్పంలోని తిరుపతి గంగమ్మ ఆలయంలో టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కూనూరు బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు ఆర్.చంద్రశేఖర్, మణి, సంతోశ్, మురళి, సుబ్బు, కనకరాజు, సుందర్, వినోద్ తదితరులు అధికారులకు స్వాగతం పలికారు.

తహసీల్దార్ల నియామకం

కుప్పం, ఆగస్టు 2: కుప్పంలోని నాలుగు మండలాలకు తహశీల్దార్లను నియమిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పం తహసీల్దారుగా వై.చిట్టిబాబు, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె తహసీల్దార్లుగా కె.అమర్నాథ్, కె.బాబు, బి.రామాంజుల నాయక్‌లు నియమితులయ్యారు. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో ఎన్నికల విధుల నిమిత్తం నియమించిన ఆయా తహసీల్దార్లను కుప్పంలోని నాలుగు మండలాలకు బదిలీ చేశారు.

నేడు ఉచిత నేత్ర చికిత్స శిబిరం

పలమనేరు, ఆగస్టు2 : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఈనెల 3వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచిత నేత్రచికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో చెన్నై శంకరనేత్రాలయ వైద్యశాల వైద్యులు మురళి పరీక్షలు నిర్వహిస్తారని, ఆపరేషన్లు అవసరమున్న వారికి చెన్నై శంకరనేత్రాలయ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. చెన్నై రాను పోను ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యకరం

పలమనేరు, ఆగస్టు2 : తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యకరమని పలమనేరు సీడీపీఓ ఇందిరాప్రియదర్శిని పేర్కొన్నారు. శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ, ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ శారద, అంగన్వాడీ సూపర్‌వైజర్లు ద్రాక్షాయిణి, నజ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ● పలమనేరు రంగాపురంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్వాడీ పిల్లలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త చిలకమ్మ, హెల్పర్ పరిమళ, ఆశ వర్కర్ లత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

శాకంబరీ అలంకరణలు



పలమనేరు, ఆగస్టు2 : పలమనేరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆషాఢమాసం సందర్భంగా స్వామివారికి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, సరస్వతీదేవి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ అలంకరణలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

పలమనేరు తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ ఇన్బనాథన్

పలమనేరు, ఆగస్టు2 : పలమనేరు తహసీల్దార్‌గా శుక్రవారం ఆర్.ఇన్బనాథన్ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో అన్నమయ్య జిల్లా రాజంపేటకు బదిలీ అయ్యారు. అక్కడి నుంచి ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఇక్కడి డీటీ రుషివర్మ, వీఆర్‌ఓలు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కాగా ఇప్పటివరకు పలమనేరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న రంగనాయకులు అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు.

విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన ఉండాలి

సోమల, ఆగస్టు 2: విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన ఉండాలని ఎంఈవో శివరత్న అన్నారు. శుక్రవారం సోమల జయంతి కాలనీ బడిలో విదార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. వెనుబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అలాగే అడుసుపల్లె, సోమల బడుల్లో విద్యార్థులతో కలసి పలు అంశాలు వివరించారు. హెచ్‌ఎంలు ఎల్లయ్య, పరిమళ, భారతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ఉచిత చికిత్సలు

పుంగనూరు రూరల్, జూలై2: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు లయన్స్‌క్లబ్, వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత చికిత్సలు అందించారు. శుక్రవారం పట్టణంలోని బీఎంఎస్‌క్లబ్ ఆవరణలో దాదాపు 140మందికి పరీక్షలు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు వైద్యులు పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటయ్యబాబు, హేమంత్‌కుమార్, సిబ్బంది మహారాజ్, వినతి, మహేంద్ర, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు డాక్టర్లు శివ, సరళ, సభ్యులు త్రిమూర్తిరెడ్డి, సురేశ్, అహ్మమద్, సుధాకరావు, గోపాల్‌కృష్ణ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సచివాలయ సిబ్బంది


బర్డ్‌లో పెన్షన్ అందిస్తున్న దిలీప్

గంగవరం, ఆగస్టు2: అనా రోగ్యంతో ఆస్పత్రిలో ఉన్న పింఛను లబ్ధిదారుడికి సచివాలయ సిబ్బంది పెన్షన్ అందించి మానవత్వం చాటుకున్నారు. గంగవరం మండలం డ్రైవర్స్‌కాలనీకి చెందిన అన్నమయ్య అనారోగ్యంతో తిరుపతి బర్డ్ ఆస్పత్రిలో కొద్దిరోజులుగా చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మారేడు పల్లె సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ దిలీప్ తిరుపతికి వెళ్లి ఆస్పత్రిలో అన్నమయ్యకు రూ.4వేలు పెన్షన్ అందించారు.

వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన అటవీ అధికారులు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 2 : బైరెడ్డిపల్లె నాలుగురోడ్ల కూడలివద్ద కొంతకాలంగా వివాదంలో ఉన్న స్థలాన్ని శుక్రవారం అటవీశాఖ సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, డీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఇది తమకు సంబంధించిన స్థలమని అటవీశాఖ అధికారులు ఒకవైపు, తమకే చెందుతుందని ప్రైవేటు వ్యక్తులు మరోవైపు వాదనలకు దిగారు. ఈ క్రమంలో అటవీ అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించారు. సర్వే చేయించి నిర్ణయం తీసుకునేవరకు ఇక్కడ ఎలాంటి కట్టడాలు నిర్మించకూడదని అటవీశాఖాధికారులు స్పష్టంచేశారు.

వాహనాల వేలం

బైరెడ్డిపల్లె, ఆగస్టు 2 : మండలంలో వివిధకేసుల్లో పట్టుబడిన వాహనాలను శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్ వద్ద డీఎస్పీ విష్ణురఘువీర్ ఆధ్వర్యంలో ఎస్‌ఈబీ శ్రీధర్‌రావు, సీఐ కృష్ణమోహన్ పర్యవేక్షణలో వేలం వేశారు. ఆరు ద్విచక్రవాహనాలు, రెండు కార్లు వేలం వేయగా రూ.2,59,700 ప్రభుత్వానికి ఆదాయం లభించింది.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు

చౌడేపల్లె, ఆగస్టు2: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని అమ్మవారి అభిషేక గంధం, పసుపు, తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రొంపిచెర్లలో అగ్ని ప్రమాదం

రొంపిచెర్ల,ఆగస్టు2: రొంపిచెర్లలోని హైస్కూల్ వీధిలోని నాగపట్ల అల్లాబక్షు ఇంట్లో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఆ సమయంలో నిద్రపోతున్న ఆఫాన్, అనస్ అనే ఇద్దరు పిల్లలను వెంటనే రక్షించారు. షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి రిఫ్రిజిరేటర్, బీరువా, దుస్తులు పాత్ర సామగ్రి, రూ.7వేలు నగదు కాలిపోయినట్లు బాధితుడు వాపోయాడు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

రామకుప్పం, ఆగస్టు 2: రామకుప్పం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం మండల టీడీపీ నాయకులు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ సీతాపతి, నాయకులు విశ్వనాథ్, మునిరెడ్డి, ప్రిన్సిపాల్ చాణక్యుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

రామకుప్పం, ఆగస్టు 2: రామకుప్పం మండలం విజలాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని కెంచనబల్ల అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను వైద్యాధికారి పూజిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సుకన్య, హెల్త్ అసిస్టెంట్ బాలు, ఎంఎల్‌హెచ్‌పీ కావ్య, అంగన్వాడీ కార్యకర్త అమరావతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వ్యవసాయక్షేత్రాలను సందర్శించిన ఎస్వీయూ విద్యార్థులు

రామకుప్పం, ఆగస్టు 2: మండలంలోని చెల్దిగానిపల్లెలోని ఆధునిక వ్యవసాయ క్షేత్రాలను శనివారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు సందర్శించారు. కళాశాల ప్రొఫెసర్లు మధుసూదన్‌రెడ్డి, మురళీకృష్ణలతో కలిసి వారు పలు పంటలను పరిశీలించారు. ఆధునిక పద్ధతులతో వ్యవసాయం, సస్యరక్షణ, దిగుబడి, మార్కెటింగ్ తదితర అంశాలను స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు.

వి.కోట తహసీల్దార్‌గా పార్వతి



వి.కోట, ఆగస్టు 2: వి.కోట తహసీల్దార్‌గా బి.పార్వతిని నియమిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె గతంలో కుప్పం, శాంతిపురం తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు.

పారిశుధ్య పనులపై దృష్టి సారించండి

వి.కోట, ఆగస్టు 2: ఇటీవల పారిశుధ్యం లోపించి చాలా గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలాయని కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని చిత్తూరు డీపీవో లక్ష్మీ సూచించారు. శుక్రవారం కుప్పం పర్యటనకు వెళుతున్న ఆమె నెర్నపల్లె వద్ద జరుగుతున్న పారిశుధ్యం పనులను పర్యవేక్షించారు. అలాగే వి.కోటలోని కుప్పం రోడ్డులో గల కీలపల్లె చెరువు పరిసరాల్లో చెత్తాచెదారాలను తొలగించి పచ్చదనం పెంపొందించాలని ఈవోను ఆదేశించారు.

శాకంబరిగా దుర్గమ్మ దర్శనం



వి.కోట, ఆగస్టు 2: పట్టణంలో వెలసిన దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ త్రయోదశి, చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు జరిపించారు. సాయంత్రం అమ్మవారిని శాకంబరిగా అలంకరించి కొలువుతీర్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

చల్లా రామచంద్రారెడ్డిని సత్కరించిన వైసీపీనాయకులు



రొంపిచెర్ల, ఆగస్టు2: మండలంలోని గానుగచింత పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం చల్లాబాబును ఆయన నివాసంలో సత్కరించారు. ఈ సందర్భంగా చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఈనెల 5వతేదీ పుంగనూరు నియోజకవర్గంలో పర్యటిస్తార్నారు. ఉదయం తన ఇంటికి వచ్చి అక్కడనుంచి పులిచెర్ల మండలం కల్లూరు, సదం, సోమల, చౌడేపల్లి మండలాల్లో టీడీపీ జెండాలు ఆవిష్కరణలు చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో గానుగచింత మాజీ సర్పంచ్ జయరామయ్య, సుధాకరరెడ్డి, టీడీపీ నాయకుడు శంకయ్య పాల్గొన్నారు.

నేడు ఆడిపద్దెనిమిది వేడుకలు

రామకుప్పం, ఆగస్టు 2: బల్ల పంచాయతీ పాలరేవుగడ్డలోని బాలమురుగన్ ఆలయంలో శనివారం ఆడిపద్దెనిమిది వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం తెలిపారు.

న్యాయమైన నష్టపరిహారం చెల్లిస్తాం : జేసీ


రైతులతో సమావేశమైన జేసీ శ్రీనివాసులు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 2 : బెంగళూరు - చెన్నై జాతీయరహదారి ఏర్పాటు కోసం మండలంలో భూము లిచ్చిన రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లిస్తామని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం బైరెడ్డిపల్లె రెవిన్యూ కార్యాలయంలో పలమనేరు ఆర్డీవో మనోజ్‌రెడ్డితో కలసి భూములిచ్చిన రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జాతీయరహదారి కోసం భూములిచ్చిన రైతులకు సంబంధించిన పత్రాలు, ఆర్బిటేషన్ తీసుకుని సోమవారం కలెక్టర్ కార్యాలయానికి రావాలని వీఆర్వోలను ఆదేశించారు. రహదారి కోసం భూములిచ్చిన పలువురు రైతులకు ఇప్పటికే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిందని ఇంకా 26మందికి ఇవ్వాల్సి ఉందని వివరించారు. పత్రాలను పరిశీలించి చెల్లిస్తామని వివరించారు. ఇందుకు రైతులు సహకరించాలని కోరారు. ఇన్‌చార్జి తహసీల్దార్ కిశోర్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల పెంపునకు కృషిచేయాలి


ఎంఈవోలతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అమర్

పలమనేరు, ఆగస్టు2 : నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు ఎంఈవోలు ప్రత్యేక దృష్టిసారించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. శుక్రవారం పలమనేరులో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి నియోజకవర్గంలోని విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల కొరత వంటి అంశాలను మండలాల వారీగా అడిగి తెలుసుకొన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని ఇందుకోసం తరచూ తనిఖీలు చేయాలన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి

పుంగనూరు రూరల్,ఆగస్టు2: సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై ఈ నెల 6న చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న వార్డన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. బాలిక వసతి గృహాల్లో స్నానపు గదులకు తలుపులు లేవన్నారు. తాగునీటి వసతులు లేని హాస్టళ్లకు వెంటనే తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు సూరి, మున్నా, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఏర్పాటు

ఏఐఎస్ఎఫ్ పుంగనూరు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సతీష్, కార్యదర్శిగా మోహన్, ఉపాధ్యక్షులుగా ధనుష్, రాజేశ్, ఆసిఫ్‌అలీ, సహాయకార్యదర్శులుగా రెడ్డి, తేజ, కన్వీనర్లుగా జయలక్ష్మి, శిరీష, మనోజ్‌లను ఎన్నుకున్నారు.

ఈఎస్ఐని అందుబాటులోకి తీసుకురండి: సీఐటీయూ


గంగమాంబ ఆలయం వద్ద సమావేశమైన సీఐటీయూ నేతలు

వి.కోట, ఆగస్టు 2: మూడు రాష్ట్రాల కూడలి ప్రాంతమైన వి.కోటలో కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ఈఎస్ఐ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా నాయకులు చైతన్య ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. శుక్రవారం వి.కోటలోని గంగమాంబ ఆలయంలో స్థానిక కార్మిక సంఘ నాయకులతో కలసి సమస్యలపై చర్చించారు. ఈ మండలంలో సుమారు 5 వేల మందికి పైగా హమాలీలు, భవననిర్మాణ కార్మికులు, ఆటో కార్మికులు, వివిధరంగాల కార్మికులు పని చేస్తున్నారని వారందరికీ వైద్య సౌకర్యం కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్న పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నేతలు సంపత్‌కుమార్, తంగరాజ్, అరున్, అప్పర్, పయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను కాపాడటం అభినందనీయం

పుంగనూరు, ఆగస్టు2: పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులు, ఆలయ భూములు, వంకపోరంబోకులను కాపాడటంలో మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి చొరవ అభినందనీయమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని కోట్ల విలువ చేసే భోగనంజుండేశ్వరస్వామి ఆస్తి వైసీపీ నాయకుల ఆధీనంలో ఉన్నట్లు ఆంధ్రజ్యోతి దినపత్రిక వెలుగులోకి తీసుకురాగా వెంటనే ఆయన స్పందించి సర్వే చేసి ఆలయానికి అప్పగించారన్నారు. అలాగే చౌడేపల్లె మార్గంలోని కాల్వను కబ్జా చేసినట్లు పత్రికల్లో కథనాలు రావడంతో నోటీసులు ఇవ్వడం హర్షనీయమన్నారు.

నెల్లిమంద పాలేటమ్మ జాతరకు శ్రీకారం


జాతర నిర్వహణపై సమావేశమైన కమిటీ సభ్యులు

సోమల, ఆగస్టు 2: మండలంలోని నెల్లిమందలో కొలువుదీరిన పాలేటమ్మవారి ఆలయంలో జాతర నిర్వహణకు కమిటీ సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలికిరి యల్లమ్మ జాతర అనంతరం పాలేటమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే జాతర ఏర్పాటుకు పలుగ్రామాల భక్తులు, కమిటీ సభ్యులు హాజరై ఈనెల 6న అమ్మవారి ఉత్సవమూర్తిని ఎగువపల్లె నుంచి ఊరేగింపుగా పాలేటమ్మ వారి ఆలయానికి తీసుకువచ్చి పూజలు నిర్వహించి 10వ తేదీ వరకు పలు గ్రామాల్లో గ్రామోత్సవాలు జరుపనున్నారు. 11, 12వ తేదీ జాతర జరిపేందుకు కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు సాకిబండ నరసింహులు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మోహన్, పాయల చంద్రశేఖర్, జగన్‌మోహన్, రమేశ్, శివకుమార్ పాల్గొన్నారు.

సకాలంలో జీతాలందించిన సీఎంకు ధన్యవాదాలు



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీచర్లు

పుంగనూరు రూరల్, ఆగస్టు2: ఉద్యోగ, ఉపాధ్యాయులు, పింఛనదారులకు నెల మొదటి తేదీన జీతాలు చెల్లించిన సీఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం మండలంలోని అడవినాథునికుంట మోడల్ స్కూల్ ఆవరణలో సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏపీఎంటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రమణ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ప్రతినెల 15తేదీ జీతాలు చెల్లించేవారిని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 010 ద్వారా జీతాలు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోకనాథం పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు అభినందనీయం



పుంగనూరు రూరల్, ఆగస్టు2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అభినందనీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు నరసింహులు, నాగభూషణం, వెంకటరమణ, గోవిందు, రెడ్డెప్ప, రమణ, కేశవ, శ్రీనివాసులు, ఆనంద్, రమేశ్, శివశంకర్, మోహన్, సురేంద్ర, నారాయణ, రవి, నాగరాజ, గంగరాజ, లింగప్ప, వెంకటేశ్, వెంకటరమణ, మణి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

పుంగనూరు రూరల్, ఆగస్టు2: సెప్టెంబరు 14న పుంగనూరు కోర్టు ఆవరణలో నిర్వహించే లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని పుంగనూరు కోర్టు ఇన్‌చార్జి మదనపల్లె సీనియర్ సివిల్ జడ్జి శిరీష కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ రాజీకి అనువైన సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవాలన్నారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు రూరల్, ఆగస్టు2: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అర్చకులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధిచేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకున్నారు.

పాము కాటుతో ఒకరికి అస్వస్థత

పుంగనూరు రూరల్, ఆగస్టు2: పాము కాటుతో ఓ వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. మండలంలోని నెక్కుంది పంచాయతీ బత్తలాపురానికి చెందిన ఆనంద్‌ను గురువారం రాత్రి ఇంటి వద్ద పశువులకు మేత వేస్తుండగా పాము కాటు వేసింది. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేడు పులిచెర్ల మండల స్థాయి సమీక్ష

కల్లూరు, ఆగస్టు 2: పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. పులిచెర్లలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమీక్షకు ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

ల్యాబ్ పరికరాల విరాళం



చౌడేపల్లె, ఆగస్టు3: చౌడేపల్లె హైస్కూల్‌కు దాత మురళినాయుడు రూ.60వేల విలువైన ల్యాబ్ పరికరాలను విరాళంగా అందించారు. హెచ్‌ఎం నాగరాజరెడ్డికి వీటిని అందించారు. ఈ సందర్భంగా దాత డాక్టర్ మురళినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు మురళి, ప్రతిమ, విజయలక్ష్మి, అమర్నాథ్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.


పిల్లలను పనిలో పెట్టుకుంటే శిక్ష తప్పదు



సోమలలో బాల కార్మికుల సర్వే

సోమల, ఆగస్టు 2: బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే శిక్ష తప్పదని చైల్డ్ లేబర్ ఆఫీసర్ మధుబాబు, ఎంఈవో శివరత్న తెలిపారు. శుక్రవారం సోమలలోని పలు హోటళ్లు, మోటర్ మెకానిక్ షెడ్లలో అధి కారులు తనిఖీలు చేశారు. 15 సంవత్సరాలలోపు పిల్లలను పనుల్లో పెట్టుకోవడం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ హరిత, హెడ్ కానిస్టేబుల్ బాలచంద్ర, అరుణ, నాగమణి, మురళి పాల్గొన్నారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, ఆగస్టు 2: పుదిపట్లలో వెలసిన వైష్ణవి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలుచేశారు. అమ్మవారికి రాహుకాలంలో పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్ కుమార్ రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు చల్లాబాబు ఆత్మీయ సమావేశం

చౌడేపల్లె, ఆగస్టు2: పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామ చంద్రారెడ్డి కార్యకర్తలతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించ నున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్థానిక శ్రీనివాస కళ్యాణ మండపంలో మధ్యాహ్నం సమావేశం ఉంటుందని, అలాగే ఈనెల 5న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పర్యటన ఉంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రైతుల పొలాలకు దారి చూపండి: టీడీపీ


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న మాధవరెడ్డి, రైతులు

పుంగనూరు, ఆగస్టు2: రైతుల పొలాల్లోకి దారి చూపాలని టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి కోరారు. శుక్రవారం ఈమేరకు తహసీల్దార్ శివయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో శ్రీకాళహస్తి సిమెంట్ ఫ్యాక్టరీకి భూములు సేకరించార్నారు. అయితే పరిశ్రమ యాజమాన్యం మిగిలిన రైతులు వారి పొలాల్లోకి వెళ్లకుండా కంచె వేసిందన్నారు. దీనివల్ల ఆరడిగుంట పంచాయతీలోని అమ్మిగానిపల్లె, కుర్రపల్లె, గోపిశెట్టిపల్లె తదితర గ్రామాలకు చెందిన పొలాలకు దారి సమస్య ఏర్పడినట్లు ఆయన వివరించారు. గతనెలలో మాట్లాడితే రైతులకు ఇబ్బందిలేకుండా దారి ఇస్తామన్నారని ప్రస్తుతం మళ్లీ యాజమాన్యం మళ్లీ కంచెవేసిందని తెలియజేశారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ గత తహసీల్దార్ ఫ్యాక్టరీ కోసం ఉన్న రెండు దారులనూ అప్పగించేశారని వివరించారు. ఫలితంగా సమస్య ఏర్పడిందన్నారు. త్వరలోనే రైతులకు ఇబ్బందిలేకుండా మరోవైపు దారి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఇంకా పరిహారం అందని వారుంటే వినతిపత్రం అందిస్తే న్యాయం చేయడానికి తనవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు , రైతులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



పల్లె రఘునాథరెడ్డి, విజయభారతిసైనీలకు జ్ఞాపికలు అందిస్తున్న అధికారులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 2: పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి, హ్యూమన్‌రైట్స్ కమిషనర్ విజయభారతిసైనీ, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ వాసు వారికి స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాలూకా సీఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



చిత్తూరు, ఆగస్టు 2: చిత్తూరు తాలూకా సీఐగా శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ సీఐగా ఉన్న కుళ్లాయప్పను ప్రభుత్వం వీఆర్‌కు తీసుకో గా.. డీటీసీలో సీఐగా ఉన్న శ్రీనివాసరావును తాలూకాకు బదిలీ చేశారు. ఆయనకు సిబ్బంది స్వాగతం పలికి, అభినందనలు తెలిపారు.

యాదమరి తహసీల్దార్‌గా జయంత్

యాదమరి, ఆగస్టు 2: యాదమరి తహసీల్దార్‌గా జయంత్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ నియమించారు. ఎన్నికల్లో భాగంగా ఇక్కడ తహసీల్దార్‌గా వచ్చిన దైవాదీనాన్ని సొంత జిల్లా కర్నూలుకు బదిలీ చేయడంతో వెదురుకుప్పం తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా ఉన్న జయంత్‌ను తహసీల్దార్‌గా నియమించారు.

జీడీనెల్లూరు తహసీల్దార్‌గా చంద్రశేఖర్ బాధ్యతలు



గంగాధరనెల్లూరు, ఆగస్టు 2: గంగాధరనెల్లూరు తహసీల్దార్‌గా ఉమ్మడి చంద్రశేఖర్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా ఆలూరు మండల తహసీల్దార్‌గా పనిచేసి, ప్రస్తుతం ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన రవి ఎన్నికల బదిలీల్లో భాగంగా కర్నూలు జిల్లాకు వెళ్లారు. కొత్త తహసీల్దార్‌ను డిప్యూటీ తహసీల్దార్ తులసీరామ్, మండల సర్వేయర్ గణేష్, రీసర్వే ఎన్నికల డీటీ నారాయణరెడ్డి అభినందించారు.

గుడి స్థలం కబ్జా చేశారని ఫిర్యాదు

పెనుమూరు, ఆగస్టు 2: వినాయకస్వామి గుడికి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేశారని మండలంలోని విడిదిపల్లి గ్రామస్తులు శుక్రవారం డీటీ మహేశ్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామకంఠం భూమిలో దాతల సాయంతో గుడి నిర్మించామని, దానికి అనుకుని ఉన్న కొంత ఖాళీ స్థలాన్ని ఆలయ అవసరాల నిమిత్తం కేటాయించామని తెలిపారు. గ్రామానికి చెందిన ఈశ్వర్‌బాబు, నరేంద్రలు ఆ భూమిని ఆక్రమించి, నిర్మాణాలు చేపడుతున్నారని, అడ్డుకుని గుడి స్థలాన్ని కాపాడాలని డీటీకి వినతిపత్రం సమర్పించారు.

విద్యా సామగ్రి పంపిణీ



విజయపురం, ఆగస్టు 2: మండలంలోని ఆలపాకం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం వందవాసి మహేష్‌శర్మ విద్యార్థులకు విద్యా సామగ్రి పింపిణీ చేశారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, నోటుపుస్తకాలు, ఎగ్జామ్ ప్యాడ్లు వితరణగా అందించారు. హెచ్ఎం తిరుమలేశు, చంద్రయ్య, ఉపాధ్యాయులు భాగ్యరాజ్, విష్ణుప్రియ పాల్గొన్నారు.

తల్లిపాలే పిల్లలకు శ్రేయస్కరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

పెనుమూరు. ఆగస్టు 2: పుట్టిన అరగంట నుంచి బిడ్డకు తల్లిపాలు పట్టవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని చిప్పారపల్లి గ్రామంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు, బాలింతలకు తల్లిపాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగ నిరోధక శక్తి

విజయపురం : బిడ్డకు తల్లిపాలు తాగించడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పీహెచ్ఎన్ భారతి తెలిపారు. విజయపురంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. తల్లిపాల విశిష్టత గురించి ఆమె వివరించారు. ఏఎన్ఎం శాంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు హైమావతి, విజయ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం

తవణంపల్లె, ఆగస్టు 2: మండలంలోని గాజులపల్లెలో మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ద్రౌపది అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేయించారు. నవతరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయడానికి మహాభారత కథలు ఉపయోగపడుతాయన్నారు.

చౌకదుకాణం ప్రారంభం



పూతలపట్టు, ఆగస్టు 2: పూతలపట్టులో నూతనంగా ఏర్పాటు చేసిన చౌకదుకాణాన్ని టీడీపీ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ప్రతాపనేని చంద్రమౌళి, గుంటూరు మురళి, వీరభద్రయ్య, మునికృష్ణమ నాయుడు పాల్గొన్నారు.

నేడు చిత్తూరు మండల మీట్

చిత్తూరు రూరల్, ఆగస్టు 2: చిత్తూరు రూరల్ మండల సర్వసభ సమావేశం శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు చిత్తూరు ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాఘవేంద్ర వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ హాజరవుతారని పేర్కొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ సుదర్శన్ ప్రసాద్

పూతలపట్టు, ఆగస్టు 2: వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని, లేకుంటే జరిమానా విధిస్తానని పూతలపట్టు సీఐ సుదర్శన్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన రంగంపేట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని వాహనదారులకు సూచించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయ బృందం

వెదురుకుప్పం, ఆగస్టు 2: ముగ్గురు వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ రమేష్ శుక్రవారం తెలిపారు. ఐరాల గవర్నమెంటు హైస్కూల్‌లో నిర్వహించిన సీనియర్ సాఫ్ట్‌బాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో విద్యార్థులు తరుణ్, ఉమ, హిందూ ప్రతిభ కనపరచడంతో ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల పదో తేదీ నుంచి 12 వరకు పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

వెదురుకుప్పం తహసీల్దార్ బదిలీ

వెదురుకుప్పం, ఆగస్టు 2: వెదురుకుప్పం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.జయంత్‌ను యాదమరి తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వెదురుకుప్పం తహసీల్దార్‌గా తిరుపతి జిల్లా సివిల్ సప్లయ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.రమేష్ బాబును నియమించింది.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు



వెదురుకుప్పం, ఆగస్టు 2: మాంబేడు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ ఆధ్వర్యంలో చేపట్టారు. క్రియా శీలక సభ్యత్వం తీసుకోవడం కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు.

నాగాలమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న సీకే బాబు

చిత్తూరు కల్చరల్, జూలై 2: నగరంలోని సంతపేట ఇందిరానగర్‌లో వెలసిన నాగాలమ్మ ఆలయ 21వ వార్షికోత్సవం శు క్రవారం ఘనంగా నిర్వహించారు. చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు ఉత్సవ నిర్వాహకులు అన్నదానం చేశారు.

సాయిలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 2 : గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో శుక్రవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని సాయిలింగేశ్వర స్వామికి సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు భక్తులతో రుద్రాభిషేకం చేయించారు. పూజలకు అవసరమయ్యే పూజద్రవ్యాలను సమితి నిర్వాహకులు ఉచితంగా అందజేశారు. పూజలనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

టీచర్ల నిరసనను జయప్రదం చేయండి

కార్వేటినగరం, ఆగస్టు 2: సమస్యల పరిష్కారం కోసం డీఈవో కార్యాలయం ఎదుట శనివారం టీచర్లు చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్టీయూ మండలాధ్యక్షుడు దేవయ్య కోరారు. టీచర్ల సీనియారిటీ జాబితా సిద్ధం చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ప్రమోషన్ల వ్యవహారంలోనూ పలు సమస్యలు ఉన్నాయని తెలిపారు. న్యాయబద్ధమైన సమస్యలపై జరుగుతున్న ఈ కార్యక్రమానికి టీచర్లు హాజరుకావాలని కోరారు.

మీటింగ్ హాలు, వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు



మినరల్ వాటర్ ప్లాంట్ గదిని పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి

గంగాధరనెల్లూరు, ఆగస్టు 2: చిత్తూరు కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీడీనెల్లూరు పీహెచ్‌సీ ఆవరణలో మీటింగ్ హాలు, హైస్కూల్లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఫౌండేషన్ చైర్మన్, చిత్తూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి సర్పంచ్ సుబ్రమణ్యం, హెచ్ఎం హేమలతలతో కలిసి పరిశీలించారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమ్యే గది, కొళాయిల గురించి చర్చించారు. పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవి, మండల ఇండియన్ రెడ్ క్రాస్ అధ్యక్షుడు పాపిరెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం దినకర్ ఆయన వెంట ఉన్నారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, మేయర్

చిత్తూరు, ఆగస్టు 2: కార్మికులు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే, మేయర్‌లు ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీల పరిధిలోని కార్మికుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఏడాదికి రూ.1,500 చెల్లించడం ద్వారా రూ.5 లక్షల వరకు ఆరోగ్యబీమా సౌకర్యాన్ని పొందవచ్చని తెలిపారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అందించడానికి వీలుగా ప్రత్యేక అధికారిగా మెప్మా పీడీని నియమిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ కొవిడ్ సమయంలో కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. తొలిరోజు 1-25 డివిజన్లలో పనిచేసే కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మేయర్ అముద, డిప్యూటీ మేయ ర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత పాల్గొన్నారు.

విద్యార్థి దశ చాలా కీలకమైంది



విద్యార్థులకు బ్యాగ్‌లు, నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, ఆగస్టు 2: విద్యార్థి దశ చాలా కీలకమైందని, పోటీతత్వంతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శుక్రవారం ఆయన పూతలపట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బ్యాగ్స్, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. తల్లిదండ్రులు పడే కష్టాన్ని విద్యార్థులు గుర్తించి, ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను బాగా చూసుకోవాలన్నారు. టీడీపీ నాయకులు గంగారపు గోపి, ప్రతాపనేని చంద్రమౌళి, గుంటూరు మురళి, బాబురావు, జయప్రకాష్, మంజునాథ్, ఎన్ఎస్ఎస్ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లల హక్కులు పరిరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిట్టిబాబు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 2: బడిఈడు పిల్లల హక్కులను పరిరక్షించాల్సిన అవసరముందని డీఈవో దేవరాజు, ఎన్‌సీపీసీఆర్ రిసోర్స్ పర్సన్ చిట్టిబాబు అన్నారు. శుక్రవారం విజయం కళాశాలలో నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ రైట్స్ అనే అంశంపై హెచ్ఎంలు, ఎంఈవో-2లకు జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. పిల్లలు శారీరక, మానసిక లోపాల కారణంగా, కులమత పరంగా విద్యకు దూరం కాకూడదన్నారు. సీఎంవో జయప్రకాష్, నోడల్ అధికారి హసనుల్లా పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం సీఆర్ఆర్ స్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు హెల్మెట్, కార్లు, ఇతర వాహనాలు నడిపే వారు సీట్ బెల్టు తప్పక ధరించాలన్నారు. సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. ఏఎస్ఐ లక్ష్మీపతి, కరస్పాండెంట్ మమతా, డైరెక్టర్ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి టీడీపీ కట్టుబడి ఉంటుంది

చిత్తూరు సిటీ, ఆగస్టు2: టీడీపీ ఎల్లప్పుడూ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును టీడీపీ స్వాగతిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్, వైసీపీ నేతలు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.1,600 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు కట్టలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.లక్షా 40 వేల కోట్లకు పైగా బకాయిలు పెట్టి గద్దె దిగిపోయిన వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు పెంచండి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 2: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు పెంచాలని డీఈవో దేవరాజు, ఏడీ ఇన్‌చార్జి ఓపెన్ స్కూల్ వెంకటేశులు కోరారు. శుక్రవారం స్థానిక డీఈవో కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు అధికంగా చేయాలని సూచించారు. బడి మానేసిన వారిని గుర్తించి, చదువుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఓపెన్ స్కూల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు మార్గం చూపాలన్నారు. అనంతరం సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమారి, సెంటర్ కోఆర్డినేటర్లతో కలసి అడ్మిషన్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

గెస్ట్ టీచరు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, ఆగస్టు 2: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో బోధించడానికి గెస్ట్ టీచర్లుగా పనిచేయడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయాధికారి టి.పద్మజ పేర్కొన్నారు. మహిళల విభాగంలో జేఎల్ ఇంగ్లిషు 01, జేఎల్ ఫిజిక్స్ 01, జేఎల్ కామర్స్ 01, పీజీటీ ఇంగ్లిషు 01, పీజీటీ సోషియల్ స్టడీస్ 01, టీజీటీ హిందీ 01, టీజీజీ ఫిజిక్స్ సైన్స్ 01, టీజీటీ సోషియల్ స్టడీస్ 02, పీఈటీ 02 ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. పురుషుల విభాగంలో జేఎల్ ఫిజిక్స్ 01, పీజీటీ ఇంగ్లిషు 01, పీజీటీ మ్యాథ్స్ 01, పీజీటీ ఫిజికల్ సైన్స్ 01, టీజీటీ తెలుగు 02, టీజీటీ హిందీ 01, టీజీటీ ఇంగ్లిషు 01, టీజీజీ మ్యాథ్స్ 01, టీజీటీ ఫిజికల్ సైన్స్ 02, టీజీటీ బయోలాజికల్ సైన్స్ 01, టీజీటీ సోషియల్ స్టడీస్ 02, పీఈటీ 02 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా కో- ఆర్డినేటర్, ఏపీఎస్ డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ, జిల్లా ఉపాధి కార్యాలయ సముదాయం, పుత్తూరు రోడ్డు, చిత్తూరు చిరునామాకు దరఖాస్తులను పంపాలని కోరారు.

నేడు 17 కొత్త బస్సులను ప్రారంభించనున్న మంత్రి



చిత్తూరు డిపోలో మంత్రి ప్రారంభించనున్న సర్వీసులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 2: చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు 17 కొత్త బస్సులను చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం రాష్ట్ర రోడ్డు, రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఇందులో చిత్తూరు 2డిపోకు 5, చిత్తూరు 1 డిపోకు 1, కుప్పం 2 డిపోకు 2 బస్సులను మొత్తం 8 బస్సులను చిత్తూరు జిల్లాకు కేటాయించారు. అన్నమయ్య జిల్లాకు చెందిన మదనపల్లె 1 డిపోకు 2, మదనపల్లె 2 డిపోకు 3, పీలేరు 3, రాజంపేట 1 మొత్తం 9 సర్వీసులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాలతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. కాగా అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చిత్తూరు ఆర్టీసీ 1, 2 డిపోలకు 8 బస్సులను తీసుకొచ్చేందుకు కృషి చేశారు.

డైట్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

కార్వేటినగరం, ఆగస్టు 2: డైట్‌లో డీఎడ్ మొదటి సంవత్సర విద్యార్థుల ఫ్రెషర్స్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డైట్ ప్రిన్సిపాల్, తిరుపతి డీఈవో శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి జ్ఞాన సంపదతో భవిష్యత్తులో ఉత్తమ టీచర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. డీఎడ్ కోర్సు పూర్తి చేసిన వారికి భవిష్యత్తులో టీచర్ పోస్టులు లభించే అవకాశం ఉందన్నారు. గతంలో ఈ కోర్సులో చేరే వారి సంఖ్య తక్కువగా ఉండేదని, ఈ విద్యా సంవత్సరం ఎక్కువమంది చేరడం శుభపరిణామమని అన్నారు. డైట్ ప్రతిష్ఠను ఇనుమడింపజేసే విధంగా శిక్షణార్థులు విద్యలో రాణించాలని కోరారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి.

పాముకాటుతో విద్యార్థినికి అస్వస్థత



విజయపురం, ఆగస్టు 2: మండలంలోని పన్నూరు ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న హర్షిత పాము కాటుతో అస్వస్థతకు గురైంది. నింద్ర మండలం కూనమరాజుపాళెం గ్రామానికి చెందిన గోవిందరాజులు, గీత దంపతుల కుమార్తె హర్షిత గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటుకు గురైంది. ఆ విషయం తెలియకుండానే ఉదయం పాఠశాలకు యథావిధిగా చేరుకుంది. ఉన్నట్టుండి అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి హుటాహుటిన నగరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి తిరుపతి రుయాస్పత్రికి రెఫర్ చేశారు. రుయాలో చికిత్స చేస్తున్నారని, మాటలు రావడం లేదని తల్లిదండ్రులు తెలిపారు.

సామాజిక తనిఖీ బహిరంగ సభ

యాదమరి, ఆగస్టు 2: మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. డ్వామా పీడీ రాజశేఖర్, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అధికారిణి గంగా భవానీ హాజరయ్యారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.3.92 కోట్ల పనులు చేపట్టినట్లు అధికారులు లెక్కలు చూపించారు. ఈ నిధుల వినియోగంపై సామాజిక తనిఖీ చేసి రూ.1.61 లక్షలు రికవరీ చేసినట్లు ఎంపీడీవో సింగయ్య తెలిపారు. ఎస్టీఎం లోకేష్‌బాబు, ఎస్ఆర్‌పీ మల్లికార్జున పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో ఎమ్మెల్యే

యాదమరి, ఆగస్టు 2: మండలంలోని రామకృష్ణాపురం బీసీవై కాలనీలో శుక్రవారం జరిగిన గంగజాతరలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ పాల్గొన్నారు. జాతర నిర్వాహకులు ఆయన్ను డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లతో ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు మురార్జీ, బంగారుపాళ్యం మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రవి, నేతలు రవి, విజయేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా మూలగుట్టాలమ్మ తిరునాళ్ల



గుడిపాల, ఆగస్టు 2: మండలంలోని నంగమంగళం గ్రామంలో శుక్రవారం మూలగుట్టాలమ్మ తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. పుట్టకు ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామనాథరెడ్డి

పాలసముద్రం, ఆగస్టు 2: మండలంలో గత ప్రభుత్వంలో మంజూరై ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాన్ని అక్టోబరు 30వ తేదీలోగా పూర్తి చేయించాలని ఎంపీడీవో రామనాథరెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. మండలంలో ఆగిపోయిన 233 ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి మూడు నెలల్లో పూర్తిచేసేటట్లు అవగాహన కల్పించాలన్నారు. హౌసింగ్ ఏఈ దాము, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాబు, ఈవోపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ మోహనకృష్ణ

పాలసముద్రం, ఆగస్టు 2: మండలంలోని ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని డాక్టర్ మోహనకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన ఆముదాల సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. వర్షాలకు గ్రామాల్లో దోమలు వ్యాప్తిచెంది వ్యాధులకు దారితీసే అవకాశముందన్నారు. దోమ తెరలు వాడి, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేటట్లు చూడాలన్నారు. శుక్రవారం డ్రై డేని పాటించేటట్లు అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు లావణ్య, జయలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆలయాల్లో మూడో శుక్రవార పూజలు



అలంకరణలో ఆర్య అమ్మన్

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 2: నగరంలోని పలు ఆలయాల్లో మూడో శుక్రవార పూజలు ఘనంగా నిర్వహించారు. గుర్రప్ప నాయుడు వీధి అంకాల పరమేశ్వరి ఆలయంలో భక్తులు అంబలి నైవేద్యంగా సమర్పించి, పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. సంతపేట కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి కుంకుమ అలంకారం, 75 దొడిపల్లె ఆర్య అమ్మన్ ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు అంబలిని ప్రసాదంగా పంపిణీ చేశారు. గిరింపేట దుర్గాంబ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి దీపారాధనలు, కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ట్రాఫిక్ మళ్లింపుతో ఇక్కట్లు

గుడిపాల, ఆగస్టు 2: బెంగళూరు- చెన్నై జాతీయ రహదారిలోని నంగమంగళం, గట్రాలమిట్ట వద్ద రోడ్డు పనుల్లో భాగంగా ట్రాఫిక్‌ను మళ్లించడంతో విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎంపీపీ నాగరాజయాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సర్వీస్ రోడ్డును పూర్తి చేసిన తర్వాతే హైవే పనులు చేపట్టాలన్నారు. సర్వీస్ రోడ్డు పనులు పూర్తి చేయకుండానే ట్రాఫిక్‌ను మళ్లించడంతో ఆరు కిలోమీటర్ల దూరం విద్యార్థులు నడిచివెళ్లాల్సి వస్తోందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.